## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో

# ఎంపీలకూ కోటా ఇవ్వాలి

**- సీఎంకు రఘునందన్ లేఖ**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు బహిరంగ లేఖ రాశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు కూడా 40 శాతం కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల మాదిరిగానే ఎంపీలు కూడా ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులే అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా 17 మంది ఎంపీలకూ అవకాశం కల్పించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపికలో సహేతుకత పెరగడానికి ఇది దోహదపడుతుందన్నారు. పేద ప్రజలకు మరింత న్యాయం జరగడం కోసమే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా ఇందులో వినియోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఎంపీగా పనిచేసిన సీఎం రేవంత్ వెంటనే నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు రఘునందన్‌రావు లేఖలో పేర్కొన్నారు.

## వంతెన కూలిన ఘటనలో నలుగురు ఇంజినీర్ల సస్పెన్షన్




**విశ్వంభర, వడోదర :** గుజరాత్‌లోని వడోదర సమీపంలో ఓ వంతెన కూలిన ఘటనలో 16 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం భూపేంద్ర పటేల్ చర్యలకు ఉపక్రమించారు. విధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చెందిన నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేశారు.సీఎం భూపేంద్ర పటేల్ చేతుల్లోనే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఉంది. ఘటన నేపథ్యంలో ఆయన.. గతంలో ఈ వంతెనకు చేపట్టిన మరమ్మతులు, తనిఖీలు, నాణ్యతా పరీక్షల వివరాలతో ఓ నివేదికను సిద్ధం చేయాలని నిపుణులను ఆదేశించారు. దీని ఆధారంగానే నలుగురు ఇంజినీర్లను సస్పెండ్ చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.ఎం.నాయకవాలా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు యు.సి.పటేల్, ఆర్.టి.పటేల్, అసిస్టెంట్ ఇంజినీర్ జె.వి.షాపై వేటు వేసినట్లు పేర్కొంది. రాష్ట్రంలోని ఇతర వంతెనలనూ వెంటనే ముమ్మరంగా తనిఖీ చేయాలంటూ ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించింది. వడోదర సమీపంలోని మహిసాగర్ నదిపై ఉన్న వంతెన బుధవారం కూలిపోయింది. ఆ సమయంలో వంతెనపై వెళ్తున్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఓ ఆటో నదిలో పడిపోయాయి. ఒక ట్యాంకర్ వంతెనపై ఇరుక్కుపోయింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 16 మంది మృతదేహాలను వెలికితీశారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. మరో ముగ్గురు, నలుగురి ఆచూకీ లభించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలి: కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** కూకట్‌పల్లిలో పరిధిలోని కల్తీ కల్లు ఘటనపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ ఘటన బాధాకరమన్న ఆయన.. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో ఉన్న బాధితులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

## ఆ ఒక్కచోటే 14,542మంది మహిళల్లో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు!



**విశ్వంభర, ముంబయి:** మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో వేలాది మంది మహిళల్లో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు బయటపడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు సంజీవని పథకంలో భాగంగా అధికారులు జరిపిన స్క్రీనింగ్ పరీక్షల్లో ఈ విషయం వెల్లడైనట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రకాశ్ అబిత్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మహారాష్ట్ర అసెంబ్లీకి ఇచ్చిన లిఖిత పూర్వక ప్రకటనలో ఈ విషయాలను వెల్లడించారు. మార్చి 8 నుంచి మొత్తంగా 2,92,996 మందికి సర్వే నిర్వహించగా.. క్యాన్సర్ లక్షణాలకు సంబంధించి ఇచ్చిన ప్రశ్నపత్రానికి మహిళలు సమాధానాలిచ్చారని మంత్రి పేర్కొన్నారు. వీరిలో 14,542 మంది మహిళల్లో క్యాన్సర్ తరహా లక్షణాలు గుర్తించినట్లు ఆయన తెలిపారు. స్క్రీనింగ్, టెస్టుల అనంతరం ముగ్గురికి గర్భాశయ క్యాన్సర్, ఒకరికి రొమ్ము క్యాన్సర్, ఎనిమిది మందికి నోటి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధరణ అయిందని మంత్రి పేర్కొన్నారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స చేసేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ చొరవతో హింగోలిలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అయితే, మహిళలకు ప్రత్యేక క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదీ లేదని మంత్రి స్పష్టం చేశారు. క్యాన్సర్ నిర్ధరణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, స్క్రీనింగ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే, జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాల ఆస్పత్రుల్లో క్యాన్సర్‌కు చికిత్స అందించనున్నట్లు వెల్లడించారు. టాటా మెమోరియల్ ఆస్పత్రి నుంచి శిక్షణ పొందిన 'క్యాన్సర్ వారియర్స్' ప్రతి నెలా నిపుణులతో కలిసి రెండుసార్లు 11 ఆస్పత్రులను సందర్శిస్తారని అసెంబ్లీకి తెలిపారు. ఎనిమిది జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కీమోథెరపీ కేంద్రాలను ప్రారంభించామని, అన్ని జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

# కాంగ్రెస్, కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిది

- బీహార్లో ఎలిమినేషన్ ప్రక్రియ ప్రజాస్వామ్య విరుద్ధం
- బీజేపీ అధికారంలో వచ్చాక రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తోంది
- దేశంలో ఎలక్షన్ కమిషన్ కొందరి వ్యక్తులకు లాభం చేసే సంస్థగా మారడం దౌర్భాగ్యం
- దేశం భవిష్యత్ కోసం లౌకిక వాద శక్తులు బలపడాలి
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది
- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- సీపీఐ మఖ్దూమ్ కార్యాలయ పునః ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్ :** సీపీఐ మఖ్దూమ్ కార్యాలయ పునః ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఖ్దూమ్ జీవితం, భావజాలం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తీవ్రంగా స్పందించారు. మఖ్దూమ్ జీవితం తెలుగు నేలకే కాదు, దేశ ప్రజలకు గొప్ప సందేశమని ఆయన అన్నారు.మఖ్దూమ్—సాహితీ, రాజకీయ వైభవానికి ప్రతీకగా నిలిచారని మహేష్‌కుమార్ గౌడ్ గుర్తుచేశారు. "సింగరేణి కార్మికులతో ఆయనకు ఉన్న అనుబంధం ఎనలేనిది. బద్దం ఎల్లారెడ్డి, వెంకట్ రెడ్డి లాంటి యోధులతో కలిసి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ఘనత మఖ్దూమ్‌ది" అని ఆయన చెప్పారు. కేవలం కవి మాత్రమే కాక, మంచి నటుడిగా కూడా మఖ్దూమ్ పేరు తెచ్చుకున్నారన్న విషయాన్ని మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రముఖ విదేశీ రచయిత జార్జ్ బెర్నార్డ్ షా నాటకాలను ఉర్దూలోకి అనువదించిన వారిలో మఖ్దూమ్ ముఖ్యులని చెప్పారు.

1974 ఫిబ్రవరి 17న ప్రారంభమైన ఈ కార్యాలయానికి అప్పటి కాంగ్రెస్ మంత్రులే పునాది వేయడం మరో ప్రత్యేకతగా గౌడ్ గుర్తు చేశారు. "కాంగ్రెస్‌కమ్యూనిస్టుల అనుబంధం విడదీయ రానిదని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఇద్దరు వేరు కాదని" ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిస్టు భావజాలానికి మరణం లేదని, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కొదవ లేదని వ్యాఖ్యానించిన మహేష్‌కుమార్ గౌడ్, "అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసి విజయాన్ని అందుకున్నాం. బలమైన లౌకిక శక్తులే దేశ భవిష్యత్‌కు భద్రత" అని గుర్తు చేశారు.

ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న ఫాసిస్టు పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. "తమ పదవులను కాపాడుకునేందుకు ఫాసిస్టు శక్తులు ఎంత దూరమైనా వెళ్తున్నాయి. విద్యావంతులు సైతం హిందూత్వ కార్డును ఉపయోగించడం శోచనీయం. లౌకికత గురించి మాట్లాడితే అర్బన్ నక్సల్స్ అంటారు. ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడితే దేశ ద్రోహులమంటారు. ఇదే వారి తత్వం" అని ఉద్ఘాటించారు.

**ఆపరేషన్ కగార్ పై ఆగ్రహం..**

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. "మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రానికి మానవత్వం లేకుండా సీజ్ ఫైర్ దాడులకు పాల్పడటం దారుణం. ఇందులో మహిళలు, పిల్లలు ప్రాణాలు కోల్పోయారు" అన్నారు. ఆపరేషన్ కగార్ పై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మరుసటి రోజే తనపై అర్బన్ నక్సలైట్, దేశద్రోహి ముద్ర వేయడం వెనుక కుట్రలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

రాజకీయ స్వార్థాలకు ఎలక్షన్ కమిషన్ బలి..

దేశంలో ఎన్నికల సంఘం తీరుపై కూడా మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఎలక్షన్ కమిషన్ కొందరి ప్రయోజనాలకు దాసోహంగా మారడం దురదృష్టకరం. బీహార్‌లో ఓట్ల ఎలిమినేషన్ ప్రక్రియ ఒకే పార్టీకి మేలు చేసేలా సాగింది. సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న ఈ అంశంపై ఇండియా కూటమి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని పార్టీలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది" అన్నారు. ప్రధాని మోదీ ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన రెండు కోట్ల ఉద్యోగాల ప్రస్తావన చేస్తూ, "ఉన్న ఉద్యోగాలు తీసేసి, పబ్లిక్ సెక్టార్ యూనిట్లను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే దిశగా కేంద్రం వెళ్తోంది" అని విమర్శించారు.

సంఘటితంగా పోరాడాల్సిన సమయం..

ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని మళ్ళీ మిత్రపక్షాలకు గుర్తు చేశారు. "దేశ భవిష్యత్‌ను రక్షించాలంటే లౌకిక వాద శక్తులు బలపడాలి. ప్రజల హక్కులను కాపాడేందుకు పార్టీ, భావజాల భేదాలు మరిచి ముందుకు రావాలి" అని టిపిసిసి చీఫ్ పిలుపునిచ్చారు.

## అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు పోతాం

**- టీపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్ :** పార్టీ లో అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు పోతామని టీపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. గురువారం గాంధీభవన్ లో ఉమ్మడి హైదరాబాద్ జిల్లా నేతలతో జిల్లా ఇంచార్జ్ టీపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా పార్టీ కమిటిల పై చర్చించామని తెలిపారు. ఉమ్మడి హైదరాబాద్ జిల్లాలో 15 నియోజకవర్గాలు, 2పార్లమెంట్ లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశం లో ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసిన, డీసీసీ అధ్యక్షులు, సీనియర్ ముఖ్య నాయకుల అభిప్రాయం మరియు నాయకులు ఇచ్చిన పేర్లు తీసుకున్నామన్నారు.ఈ కమిటీలలో బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ,మహిళ అన్ని కులాల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని అందరు సూచించారని తెలిపారు.శుక్రవారం మూడు జిల్లాలకి సంబంధించిన అబ్జర్ వర్లు,పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి లతో సమావేశం ఉంటుందన్నారు. ఇక పదవుల విషయం లో మొదటి నుండి పార్టీ లో ఉన్న వారికీ ఫస్ట్ ప్రియారిటీ ఉంటుందని, అలాగే పార్టీ మారి వచ్చిన వారికీ సెకండ్ ప్రియారిటీ ఉంటుందని, లిస్ట్ కూడా ఇలాగే ప్రిపేర్ చేస్తామని జగ్గారెడ్డి తెలిపారు.ముందుగా లిస్ట్ వచ్చిన తర్వాత టీపీసీసీ చీఫ్, మరియు ఇంచార్జి పర్మిషన్ తో డివిజన్ వారి సమావేశాలు నిర్వహిస్తామన్నారు.ఈ సమావేశం లో ఎమ్మెల్యేలు,మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంత్ రావు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, డీసీసీ ప్రెసిడెంట్ రోహిన్ రెడ్డి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, ఫిరోజ్ ఖాన్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కల్తీకల్లు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి: రామచందర్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్:** కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, బాధితులకు రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ''కల్తీ కల్లు ఘటనలో అనధికారికంగా ఆరుగురు మృతి చెందారు. ఒకటి రెండు సీసాల కల్లు తాగిన వారి కిడ్నీలు దెబ్బతిన్నాయి. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మక్కైంది. ఈ ఘటన మొదటిసారి కాదు.. గతంలోనూ వెలుగు చూశాయి. ఎక్సైజ్ అధికారులు రోజూ కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంచర్యలు తీసుకోవాలి'' అని రామచందర్‌రావు అన్నారు.

## నిమ్స్ ఆస్పత్రి బాత్‌రూమ్ వద్ద పసికందు మృతదేహం

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని నిమ్స్ ఆస్పత్రి బాత్‌రూమ్ సమీపంలో పసికందు మృతదేహం లభ్యమైంది. ఓపీ బిల్డింగ్‌లోని మహిళల టాయిలెట్‌లో నీరు జామ్ కావడంతో క్లీన్ చేసే ప్రయత్నంలో పారిశుద్ధ్య సిబ్బంది గమనించారు. గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన శిశువును అక్కడి మ్యాన్‌హోల్‌లో పడేసినట్లు అనుమానిస్తున్నారు. బుధవారం ఈ ఘటన జరిగినట్లు భావిస్తున్నారు.

## సంస్కారవంతులైన విద్యార్థులే భారతావని ఆశాజ్యోతులు

**జి. వి. సి.ఏ. తెలంగాణ ప్రాంత కన్వీనర్ శ్రీ చౌదూరి నరసింహారావు**

**విశ్వంభర, హైదరాబాద్ :** విద్యతో పాటు సంస్కారాన్ని అలవర్చుకున్న విద్యార్థులే భవిష్యత్తులో భారతావని ఆశాజ్యోతులు గా వెలుగొందగలరని, దేశ రథాన్ని ముందుకు నడిపే సారథులు అవుతారని భారత్ వికాస్ పరిషత్ గురువందన్ చాత్రాభినందన్(జి.వి.సి.ఏ.) తెలంగాణ ప్రాంత కన్వీనర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీ చౌదూరి నరసింహారావు అభిప్రాయపడ్డారు. గురు పౌర్ణమి మరియు భారత్ వికాస్ పరిషత్ 63 వ స్థాపన దినోత్సవ వేడుకలు గురువారం నాడు అలకాపురి లోని వి. డి. ప్రసాద రావు మెమోరియల్ హై స్కూల్ ప్రాంగణంలో జరిగిన "గురు వందన్ చాత్రాభినందన్" కార్యక్రమానికి అధ్యక్షత వహించి శ్రీ చౌదూరి నరసింహారావు పై విధంగా అభిప్రాయపడ్డారు.గురువు గురించి, శిష్యులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దడంలో గురువు యొక్క పాత్ర గురించి, సంస్కార నిర్మాణానికై గురువులు వహించాల్సిన బాధ్యత గురించి, సోదాహరణ పూర్వకంగా వివరించారు గురువంటే వేదవ్యాస మహర్షి అని, వేదాలను క్రమబద్ధీకరించిన మహర్షి వేదవ్యాస మహర్షి అని, ఈరోజు వేదవ్యాస భగవానుని పూజించడం హిందువుగా మనందరి ముఖ్య కర్తవ్యమని గుర్తుచేశారు. నేటి విద్యార్థులు వివేకానంద స్వామిని స్ఫూర్తిగా తీసుకోవాలని చెబుతూ... వివేకానందుని బాల్యంలో జరిగిన సంఘటనను వివరించారు. తల్లి, తండ్రి తొలి గురువులని, చదువు చెప్పే టీచర్ను గౌరవించాలని హితవు చెబుతూ.. నేటి విద్యార్థులే రేపటి ఆశాజ్యోతులని తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అడుగడుగునా విద్యార్థుల కరతాళ ధ్వనులతో ప్రాంగణమంతా మారు మ్రోగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. శివరామకృష్ణ సంపర్కము, సహయోగము, సంస్కారము, సేవ, సమర్పణ అనే పంచ 'స' కారాత్మక కార్యాచరణతో భారత్ వికాస్ పరిషత్ 63 ఏళ్లుగా తన కార్యక్రమాలను దేశవ్యాప్తంగా కొనసాగిస్తూ ముందు కెళుతుందని, దేశ సేవలో ముందుందని పంచ 'స' కారాలను ఎంతో చక్కగా వివరించారు.ఈ సందర్భంగా వి. డి. ప్రసాద రావు మెమోరియల్ హై స్కూల్ కరస్పాండెంట్ శ్రీ సి. నారాయణ మూర్తిని అతిథులు వివేకానందుని జ్ఞాపిక , చౌదూరి నరసింహారావు రచించిన ఆణిముత్యాలు నవ కవి రత్నాలు పుస్తకాలతో, శాలువతో ఘనంగా గురు వందన్ సత్కారం చేశారు. హైస్కూల్లో మంచి ర్యాంకు సాధించిన ఒక విద్యార్థినిని, ఒక విద్యార్థిని ఎంపిక చేసి వారికి వివేకానందుని పుస్తకాలు, చౌదూరి నరసింహారావు పుస్తకాలతో అభినందించారు. భారత్ వికాస్ పరిషత్ లాల్ బహదూర్ శాస్త్రి నగర శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కార్యదర్శి వై. శివకుమార్ ఎంతో గట్టి పట్టుదలతో సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి. డి ప్రసాద రావు మెమోరియల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి జయశ్రీ , స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు ఎంతో చక్కగా సహకరించారు. తొలుత స్వాగత పలుకులు పలికిన వై. శివకుమార్ వందన సమర్పణతో కార్యక్రమం సంపన్నమైంది






సంస్థ నారాయణపూర్ కు చెందిన పురేందర్ తల్లి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నవి 3, విశ్వంబర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ గుప్తా. ఈ కార్యక్రమంలో నంగునూరు రమేష్, కోడుమూరు దయాకర్, బుక్క ఈశ్వరయ్య, శ్రీధర్, బచ్చు శ్రీనివాస్, రమేష్, వాసు లు పాల్గొన్నారు.

( విశ్వంభర, సంస్థ నారాయణ పురం)




వైశ్య రాజకీయ రణభేరి పోస్టర్ ను తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యదర్శి, సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్తా, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు అర్థం లక్ష్మయ్య లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్తా, కోడుమూరు దయాకర్, నంగునూరు రమేష్, సోమ శ్రీనివాస్, బుచ్చయ్య, కాటేదాన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

( విశ్వంభర, ఎల్బీనగర్)

## ఏపీ కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఫలితాలు విడుదల



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఆర్.కె.మీనా విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 37,600 మంది హాజరుకాగా.. 33,921 మంది అర్హత సాధించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో ఓఎంఆర్ షీట్లను అందుబాటులో ఉంచారు. ఈనెల 11 నుంచి 17 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు.